దర్జా

వ్యాసమూర్తి మేస్త్రీటు. ఆయన ఇక్ష్వాకులనాఁడు అప్పర్ సెకండరీ ప్యాసు అవడమే కాకుండా రెవిన్యూ టెక్‌స్ట్లు మొదలయినవన్నీ ప్యాసు అయినాఁడు.

వ్యాసమూర్తి తాఁబేలు నడకతో ఈ వుద్యోగములోకి వచ్చాఁడు. ఆయన రక్తమాంసాలు ఉద్యోగంలోనే ఉడిగినవి. ఆయన మొదటి నుంచీ నిరంకుశాధికారుల నీడలలో పెరిగాఁడు.

వ్యాసమూర్తి ప్రాతః స్నానము చేసి మూఁడురేఖలా విబూతి పూసుకొని కాళీ పూజ చేసి సుందరకాండ పారాయణం చేశాక కన్నులు మూసుకొని కొంతసేపు ధ్యానం చేశాఁడు.

కోర్టులు వచ్చాక వ్యాజ్యాలు గెలవడానికి, పెద్దపెద్ద ఉద్యోగాలు రావడానికీ సుందరకాండ పారాయణం పరాయణం అయింది. ఇహనుంచీ కావ్యంయొక్క ఉపయోగాలలో వ్యాజ్యాలు గెలవడం, ఉద్యోగాలు పొందటం ఈ రెండూకూడ పరిశిష్టాల కింద పరిగణించాలి.

కోర్టులో బెంచిమీద తానుకూచున్నట్టూ, తనకింద నుంచోని ప్లీడర్లు తమతమ వాదాలు చెప్పుకుంటూ, 'తమ ఘనము' 'తమ దివ్యచిత్తము' అని మనవులు చేస్తున్నట్టూ, కటకటాలలో ముద్దాయిలు చేతులు కట్టుకొని నుంచున్నట్లూ, తాను బహుపరాకుగా వింటున్నట్లూ వ్యాసమూర్తి భావించుకుంటున్నాఁడు. ఒకఁడికి అయిదునెల్ల యిరవై తొమ్మిదిరోజుల శిక్షా, ఇంకొకఁడికి నలభైతొమ్మిది రూపాయిల జరిమానా విధిస్తున్నట్లు తలుస్తున్నాఁడు.

ఆయనభార్య అపాల కాఫీతెచ్చి ఎదురుగా పెట్టింది. ఆయన కనులు తెఱచిచూచి 'ఛీ ఛీ ఛీ అంతాపాడుచేశా' వన్నాఁడు. అపాల పెంబేలు పడ్డది. అటుతరువాత ఆయనా తెల్లఁబోయాఁడు. మఱి మాటాడక కాఫీనైవేద్యం పెట్టి పుచ్చుకోడం మొదలు పెట్టాఁడు.

అపాల 'ఒరే రామాయ్' అని నవుకరును కసురుకుంటూ పిలిచి 'కూరాగాయా నీవు కూచుంటేనే వస్తాయా?' అన్నది. రామాయి కిక్కురుమనకుండా నిలుచున్నాఁడు. అపాల బిట్టా డబ్బులు వాని కిచ్చి 'ఆలుగడ్డలు మంచివి ఏఱి పట్రా' అనఁగానే తల ఊఁపి రామాయి వెళ్లాఁడు.

'వ్యాసమూర్తి పిలు పిలు వాణ్ణి పిలు' మన్నాఁడు. అపాల పిలిచిందిగాని జబాబు రాలేదు. ఆయన కళ్లెఱ్ఱచేసి 'ఈవెధవల కెంత పొగరో? మళ్లీ పిలుస్తా రనైనా వెనకచూపు లేదు' అని వాపోతూ ఉండఁగా రామాయి వచ్చి నిలఁబడ్డాఁడు. వ్యాసమూర్తికెక్కడ లేని సంతోషమూ వచ్చింది. 'అయితే నాకయేటట్టేవుంది' అని తల ఊఁపుకుంటూ 'టపాకెళ్లి ఉత్తరాలు పట్రావాలి; కూరగాయల బజాఱునుంచి తొందరగా రా' అన్నాఁడు. రామాయి ఊఁకొట్టి వెళ్లాఁడు.

అపాల కాఫీగిన్నెలు లోపలఁబెట్టి గబగబా వాకిట్లోకివచ్చి 'ఒరే రామాయ్, రాముఁడూ, రామిగా' అని పిలిచి 'చెవిటిగోడ! వినిపించుకుంటాఁడూ!' అని విసుగుకుంటూ వుండగా మెల్లగా రామాయి వచ్చాఁడు. రాంగానే అపాల 'ఒరే ఫూల్! బజాఱునుంచి వెంటనే వచ్చి మళ్లీవెళ్లి ఉత్తరాలు తెమ్మంటే విని ఊరుకుంటావా? 'వచ్చేటప్పుడే తెస్తా' ననలేక పోయావు? బుద్ధేదీ? మధ్యదారిలోంచే పట్రావచ్చుఁగా!' అని అన్నది.

రామాయి ఊఁకొట్టి వెళ్లాఁడు.

'ఎదురుమాట చెప్పినా ఫ్యూన్ నరసింహమే మేలు; వీఁడు మాటలు వచ్చిన మూగ,' అని అపాల లోలోపల గొణుగుకుంది.

అధికారము ముందు 'ఆ' అన్నా మరమేకే, 'ఊ'-అన్నా మరమేకే.

వ్యాసమూర్తి 'నాకూ అదే తోఁచింది. అన్నీ కలిసి వస్తున్నవి' అని అనుకుంటూ 'యేస్, ఎంత ఏబ్రాసిపని? ముందే ఉత్తరాలిచ్చి బజాఱు వెళ్ళమంటే బావుండేది. ఐనా చూదాం; వీఁడు గనుక బజాఱు వెళ్లకుండా మధ్యతోవలోంచే ఉత్తరాలు పట్టుకొస్తే తాసిల్ దారవుతా'నని నిశ్చయం చేసుకున్నాఁడు.

అపాల రాముఁడుతో ఇంకా ఏమన్నా చెపుదామా అని ఆలోచిస్తూ బజాఱు చివర కంటాచూస్తూ నిలఁబడ్డది. వీధిచివర కృష్ణాచార్లుగారింటి దగ్గిఱ బండి నిలిచివుంది.

బండీవాఁడు సామానులు లోపల వడేస్తున్నాఁడు ఆయన కొడుకు కృష్ణద్వైపాయనాచార్లు బండీవెనుక నిలుచున్నాఁడు. ఆమె గడపమెట్లు దిగి ఆచి ఆచి చూచి తల ఆడించి లోపలికి వెళ్లింది.

వ్యాసమూర్తి ఆఫీసుగదిలోకి వెళ్లి జేనజేనా పరీక్షించాఁడు. వెంటనే 'ఫ్యూన్' అని ముమ్మాఱు పిలిచాఁడు. రెండోపిలుపుకి ముందరే ఫ్యూన్ నరసింహం ఎదట నిలఁబడ్డాఁడు.

ఫ్యూన్ నరసింహం సొంతనౌకరు కాదు. అతఁడు కోర్టునౌకరు. ఐనప్పటికీ ఇంటికీ కోర్టు జీతమిస్తుంది. ఇల్లు ఇతరత్ర ఇప్పిస్తుంది.

వ్యాసమూర్తి – 'కళ్లేమయినా పోయినాయా?' అని అన్నాఁడు. 'మీకు ఇన్ని ఉద్యోగాలు వచ్చిందాఁకా పోలేదు. ఇహ తాసిల్‌దారు ఐతే యేమో' అని అంటూ వ్యాసమూర్తి నిలఁబడ్డచోట వంగిచూస్తూ తమలపాకుయీనె తీసి ఫ్యూన్ నరసింహం వాకిట్లోకి వెళ్లాఁడు. వ్యాసమూర్తి 'వీఁడు గూడా అంటున్నాఁడూ, సుందరాకాండలో పారాయణ పట్టా సరిగా వచ్చింది. నా భార్యామాటా నా మాటా కలిసింది. ఇహ రామాయి నడితోవలోంచే వస్తే యోగం పట్టిందన్నమాటే. ఒకవేళ ఇవన్నీ అబద్ధమైనా సిద్ధాంతిమాట అబద్ధమవుతుందా?' అని ఆలోచిస్తూ కురిచీలో కూచున్నాఁడు. పక్క కిటికీలోంచి సూర్యకాంతి ప్రసరించినది.

ఆలోచనకూ చీఁకటికీ సావాసం వుంది. కాని వెలుఁగుకు ఎక్కడిది?

అతఁడు 'ఫ్యూన్' అని మళ్లీ పిలిచి సంజ్ఞచేయఁగా 'ఫ్యూన్' నరసింహం కిటికీతలుపు ఓరగా మూశాఁడు.

కోరికకు కుదురులేదు. ప్రతీక్షకు ప్రశాంతి లేదు.

వ్యాసమూర్తి వాకిటిలోకి వెళ్లి చూశాఁడు. ఫ్యూన్ నరసింహం కూడా చూశాఁడు. ఆవిధం వ్యాసమూర్తి చూచివుంటే ఇదికూడా కలిసిం దనుకొనేవాడే.

రామాయి కూరలకు పోకుండానే వట్టి బుట్ట ఊఁపుకుంటూ టపానుంచి ఉత్తరాలు పట్టుకువస్తున్నాడు. వ్యాసమూర్తి ముఖమింతచేసుకొని గబగబా లోపలికి వెళ్లి కవర్లు చింపే చాకు బల్లమీఁద పెట్టుకొని కూచున్నాఁడు. కిటికీతలుపు తానే తెరచుకున్నాఁడు. బయటనుంచి నరసింహం ఇదంతా చూస్తూనే వున్నాఁడు.

రామాయి కాలిచప్పుడయింది. వ్యాసమూర్తి కుర్చీలో కుదిరి కూర్చున్నాఁడు. ఫ్యూన్ నరసింహం ఉత్తరాలకట్ట తెచ్చి బల్లమీఁదపెట్టి పక్కగా నిలుచున్నాఁడు.

వ్యాసమూర్తి 'నీవు వాకిట్లోకివెళ్లు!' అని విదిలించాఁడు. అతఁడు వెళ్లింతర్వాత ఒక్కొక్క ఉత్తరమే తీసిచూసి నిట్టూర్చి ఆ ఉత్తరాలన్నీ అక్కడే పాతేసి, కాసేపు కూచోని, 'ఫ్యూన్! ఎంతసేపల్లా వాకిట్లో కూర్చోడం?' అని అనఁగానే నరసింహం వచ్చి ఉత్తరాలకట్ట చేత్తో పుచ్చుకొని ఒక్కొక్క ఉత్తరమే చేతి కిచ్చి చదువుకోఁగానే అందుకుంటూ ఉన్నాఁడు.

అపాల వచ్చి గుమ్మము దగ్గిఱగా నిలఁబడ్డది. ఫ్యూన్ నరసింహం 'ఎవరది అవతలికిపో, పో అవతలికిపో! అది అయ్యగారి ఆఫీసు అని రాసి ఉండలేదూ?' అని తలయెత్తి తెల్లఁబోవడం అభినయించాఁడు.

మేస్త్రీటు దర్జాకు అపాల సంతోషించింది.

వ్యాసమూర్తి ఒకసారి తలయెత్తి చూచాఁడు. అపాల నవ్వుకుంటూ లోపలికి వెళ్లింది.

వ్యాసమూర్తి ఉత్తరాలుచూచుకొన్నాక, 'ఏమోయ్ కొత్త తాశీల్‌దారు వచ్చిందాఁకా మందేభారం. నేను రేపు పెళ్లికి వెళ్లాలి. కొత్తాయన వచ్చేనాఁటికే నేనూ రావాలి. నీవు జాగ్రత్తగా వుండు. నే నిహ భోజనానికి లేస్తాను. నీవువెళ్లు' అన్నాఁడు. ప్యూన్ నరసింహం 'తమరేకాకుండా కొత్తతాసిల్‌దారేవచ్చి, గుండెలతో బతుకఁగలఁడా?' అంటూ వెళ్లాఁడు. వ్యాసమూర్తి మళ్లీ పూజామందిరములోకి వెళ్లి పూజ ఆరంభించాఁడు.

రెండు జాములయింది.

అపాల మడిగట్టుకోమన్నది.

2

అపాల పడుకొని లేచేసరికి నాలుగు అయినది. సబ్బుతో మొహం కడుక్కొని అలంకరించుకుంది.

చాకలి పరదేశిగాఁడు ముందు నడవందే అపాల అడుగపెట్టి ఎఱుఁగదు. మందయానముతో గుమస్తాల యిండ్లు కటాక్షిస్తూ బయలుదేరింది. హెడుగుమస్తాగారి భార్య అన్నమ్మ గాఁ అపాలను ఆహ్వానించింది.

అపాల లోపలికివెళ్లి కూచోనేసరికి అన్నమ్మగారి కూఁతురు ఆదిలక్ష్మి అపాలను చుట్టేసుకుని – 'అత్తా, పేరమ్మగారింటికి పెత్తనానికి వెడదాం లే; ఉబుసుపోవడం లేదు!' అన్నది.

'పొద్దుపోని ముద్దరాలు పిలవకుండానే పేరంటం పోతుంది; ఉబుసుపోని ఒయ్యారికి ఊరంతా ఉబుసే. పెత్తనాలు పోకూడదమ్మా;' అని అపాల అంది.

'అయితే నివ్వెందుకొచ్చావ్?' అని ఆదిలక్ష్మి అన్నది. అన్నమ్మగారు ఆదిలక్ష్మిని చేతితో తట్టి – 'తప్పు; అల్లా పెద్దలను అనరాదు;' అన్నది. అపాల – 'నాకూ పని ఉన్నదమ్మా. పోవాలి' అని లేచింది. అన్నమ్మగారు చిన్నఁబోయి వెంటనే గదిలోనుంచి తాంబూలం తెచ్చియిచ్చింది.

ఆదిలక్ష్మి గదిలోనుంచి – 'పేను, పెత్తనాలమారి; ఆబోతుపెత్తనాలమారి, ఉద్యోగస్తుల పెళ్లాం పెత్తనాలమారి' అంటూ పాడుకోటం మొదలుపెట్టింది.

అన్నమ్మగారు, 'ఆదిలక్ష్మి ఇంకా ఏమేమి పాడిపోతుందేమో' నని తానే ముందర దారి తీసి రోడ్డుమీఁదికి తీసుకోవెళ్లి దిగవిడిచింది.

అపాల ఆనాఁడు మామూలుగా చేసే పెత్తనాలు మాని గుమస్తాల భార్యలమీఁద కటాక్షములు మాత్రమే పారేస్తూ కృష్ణాచార్లుగారి యింటికి వెళ్లింది. తలుపుతీసే వుంది, గాని ఇంట్లోఎవ్వరూలేరు. మేడమీఁద మాటలు వినిపించి 'కృష్ణద్వైపాయనాచార్లూ' అని పిలవఁగానే అతను దిగివచ్చాఁడు.

'ఇంట్లోఎవరూ లేరేమిటి?'

'సర్కీటు వెళ్లారు.'

'ఇవ్వేళ పొద్దున్న ఎవరో కొత్తలు వచ్చినట్లున్నారే; వారితో ఆఁడంగులెవరూ లేరే.

'ఆయనే ఆఁడంగి.'

'ఎవత్తేమిటీ ఆ ఆఁడంగి?'

'మనవాళ్లే-సత్తెనపల్లి, సురభిబిందుమాధవరావుగారి మనమఁడు. నాకు స్నేహితుఁడు. నన్ను చూడ్డానికివచ్చాఁడు.'

'అయితే మనకు దగ్గిఱ చుట్టతికమే?'

'ఔను'.

'ఈపూట మీరిద్దఱూ మాఇంటికి భోజనానికి రావాలి.'

'మామగారికి తాసిల్‌దారు అయిందా యేమిటి?'

'ఇదివఱకు మేస్త్రీటయితేనే విందుకు వచ్చావా యేమిటి? మీయింట్లో మీ అమ్మగారు లేరు కాఁబట్టి విందు. అన్నవస్త్రాలంతగా లేనివాళ్లకూ, బంధువులకూ, స్నేహితులకూ విందులు చెయ్యడం నాకు అతిఅభిలాష. కాఁబట్టి పిలిచాను.'

'విందు విలాసానికే అయితే కుందు. విందు భక్తినేర్పే మందు. విందు విజ్ఞానాన్ని ఇస్తుందీ, తెస్తుందీ. విందంటే విశ్వేశ్వరుఁడైన వచ్చి కూచుంటాఁడు; రాజాధిరాజైనా సరీగా చేయడానికి భయపడతాఁడు. విందు బదరే చేసింది; భగవంతుఁడే ఆరగించింది' అంటూ అపాల 'ఏమోయ్' నీవు మళ్లీ ఉద్యోగానికి ఊరూరూ తిరుగుతావు. రేపు మేము పెళ్లికి పోతూవున్నాము. మీ యింట్లోనూ ఎవళ్లూ లేరు. కొత్త ఆయనకూడా వచ్చాఁడు. ఈ పూఁట భోజనానికి మీరిద్దఱూ తప్పక రావాలి' అన్నది.

'పట్టిభోజన మయితే యెందుకూ?'

'మాయింట్లో ఏపూఁట పిండివంట లేకుండావుంది?'

'పిండివంట మీకు మామూలే నాయెను, ఇఁక విశేషం?'

'ఏం చెయ్యమంటావు?'

'మామిడిపళ్లు, పనసతొనలున్నూ.'

'ఇంతేకదా! ఇంకేమికావాలి?'

'ఏడు గంటలకే కావాలి.'

'మీరింకా ఉండఁగలరుగాని మా వారసలే ఉండులేరు. ఏడుకొట్టేసరికి విస్తళ్లు వేయిస్తా.'

'మంచిది.'

'ఏమండోయ్! ఎమ్మేగారూ! మావారు మళ్లీ రాలేదనుకోక ఏడుకొట్టేసరికే రండేం.'

'అదికొంచెం వ్యాసఘట్టమే. ఐనాచూదాం. అయితే అతన్ని వదిలేసి నన్నే రమ్మంటారా యేమిటి?'

'మామంచివాఁడ' వంటూ అపాల మేడ మీఁదికి వెళ్లి బిందు మాధవరావును చూచి 'మీ రెఱుఁగక పోయినా మనం ఒక కుటుంబంలోనివాళ్లం. మాపుట్టింటివారు సురభివారే. ఈపూఁట మాయింటికి భోజనానికి రావాలి. ద్వైపాయనాచార్లతో చెప్పాను కాని మూలిగాఁడు. 'మీరు రావాలి. ఏమంటారు? మఱొమాట చెప్పకండేం' అన్నది.

బిందుమాధవరావు మేడ మెట్లకేసి చూస్తూ వున్నాడు. కృష్ణద్వైపాయనాచార్లు కిందే ఉన్నాఁడు కాని మేడమీఁదికి రాలేదు.

అపాల - 'అతనికోసం చూడకండి. అతఁడు మిమ్మల్ని వెళ్లమంటాఁడా?' అన్నది.

ఏమంటాఁడు అటువంటప్పు-డు కొత్తవాఁడు? ఇంకోఁడైతే ఏమంటాఁడోకాని అతఁడేమీ అనలేదు.

'మాయింట మీకేం కొత్త? మేమూ సురభివారమే. మాది నరసారావుపేట. ఉద్యోగ ధర్మాన దూరంగా వున్నాం. మీదీ మాదీ ఒకటే వంశం.'

బిందుమాధవరావు మాటాడలేదు. మాటలాడక పోవడాన్నే అంగీకారంగా తీసికొని అపాల మేడదిగిపోయి ఇంట్లో ఏదోపని అభినయిస్తూ వున్న కృష్ణద్వైపాయ నాచార్లతో - 'మొత్తంమీఁద ఆయనను ఒప్పించాను. ఏడుకొట్టేసరికే రండేం. మావారు మళ్లా ఉండలేరు.' అని అపాల వెళ్లిపోయింది.

కృష్ణద్వైపాయనాచార్లు మేడమీఁదికి వెళ్లి - 'ఏమిటోయ్! భోజనానికి ఒప్పుకున్నావా?' అన్నాఁడు.

'నేనా నీవా ఒప్పుకుంది?'

'నాకేం తెలుసు; ఆమె నీవొప్పుకున్నావన్నది.'

'నీవెంత సేపటికీ మేడపైకిరాకుండా వుండడమూ, ఆమె మేమూ సురభివారమేనని బలవంతపెట్టడమూ.' నాపని చాలాచిత్రంగానే వుంది.'

'నిజమే, వారి పుట్టింటివారు సురభివారే. మనకు దగ్గిఱచుట్టాలే. ఆవిడ చాలామంచిది. ఆయన మేష్ట్రీటు సుమా! ఆయన అర్థదాక్షులకు అర్ధదాక్షు. రిఫార్మర్సుకి రిఫార్మరు. ఆయన కాళికి కాఫినైవేద్యం పెడతాఁడు. అది కెతాలిసిటీ.'

'బాగానే వుంది. అయితే ఆయనను ఒకసారి చూడవలసిందే.'

'ఒకసారి కాదు, ఎప్పుడూ చూస్తూనే వుంటావులే. సరేకాని షికారు వెడదామా?'

బిందు మాధవరావు బట్టలువేసుకుంటున్నాఁడు. కృష్ణద్వైపాయనాచార్లు తోఁటల వైపునకు దారితీశాఁడు.

చైత్ర వసంతులవలె వారిరువురూ ఒకరి ప్రక్కన ఒకరు షికారు వెళ్లారు.

3

అపాల యింటికి వెళ్లేసరికీ వ్యాసమూర్తి నౌకర్లమీఁద ధూంధాం చేస్తున్నాడు.

వ్యవసాయదారుకు విత్తేఅదను తెలిసినట్లు అపాలకు భర్తలో తన అభీష్టభీజం నాటే తరుణం బాగా తెలుసును.

'కృష్ణాచార్లుగారు సర్కీటు వెళ్లారు. ఇంట్లో కృష్ణద్వైపాయనాచార్లు ఒక్కఁడే వున్నాఁడు. ఆయన స్నేహితుఁడు ఎవరో మనవాఁడేనుట వచ్చాఁడు. చేతులు కాల్చుకుంటారేమో అని విందుకు పిలిచాను. తమలపాకులూ, అవీ తెప్పించాలి. తాళపు చెవిట్లాతెండి' అని అన్నది అపాల.

వ్యాసమూర్తి మఱి మాటాడకుండా తాళపుచెవు లిచ్చాఁడు.

అపాల 'రామాయిని పిలిచి వంటలక్కకు కబురంపించింది.

ఉద్యోగుల యిండ్లలో ఒక్కణ్ణి పిలిచినా సరే వంటలక్కలేందే విందుకాదు.

అపాల విందుహడావిడిలో వుండంగా వ్యాసమూర్తి స్వయముగా టెల్లిగ్రాం ఆఫీసుకు వెళ్లి 'వైరు రావాలి వచ్చిందా?' అని అడిగాఁడు.

'తమరే స్వయముగా దయచేశారు? తమకు తంతి యీలేనందుకు చింతగా వుందని మాష్టరన్నాఁడు.'

వ్యాసమూర్తి వెంటనే యింటికి తిరిగి వచ్చి పూజకు ప్రత్యేకముగా గులాబిపూలు, నైవేద్యమునకు సోడాలు తెప్పించాఁడు.

స్నానముచేసి పూజకు కూర్చున్నాఁడు. సహస్రనామాలు అష్టోత్తరశతాలు మొదలయినవన్నీ అయినవి.

ఆయన ధ్యానంలో కాళి తాసిల్‌దారుగా మాఱింది.

అపాల ఎదటికి వచ్చింది. వ్యాసులు కన్నెత్తి చూచాఁడు. 'ఆయన జమీందారీ కుటుంబంలో వాఁడు కూడాట! మనిషిని పంపిస్తే బావుండదు. మీరే వెళ్లి పిలుచుకోవస్తే బావుంటుందనుకుంటాను!' అని అపాల అన్నది.

'పరదేశిగాణ్ణి పంపు' అని వ్యాసమూర్తి ఉఱిమాఁడు.

'ఔను, పరదేశిగాఁడు చాకలిగా! పనికి వస్తాఁ'డని అపాల పరదేశిగాణ్ణి పిలిచి భోజనానికి పిలవనంపింది.

భోజనశాలలో అపాల, వ్యాసమూర్తి కానుపీఁటా, కూర్చోనేపీఁటా, మిగతా యిద్దఱికీ చెఱో కుర్చోనేపీఁటా స్వయముగా పఱిచింది. ఒక పెద్ద అరఁటాకున్నూ, రెండు చిన్న అరఁటాకులున్నూ వేసింది. భర్తకు వెండి చెంబూ, వెండిగిన్నా, వెండికంచం విస్తరిచుట్టూ పెట్టింది.

బిందుమాధవరావును భోజనానికి తీసుకోరావడం కృష్ణద్వైపాయనాచార్లకు కృత్యాద్యవస్థే అయింది.

బిందుమాధవరావు, కృష్ణద్వైపాయనాచార్లూ పట్టుతాపితాలు కట్టుకొనివచ్చారు. గడియారం ఏడుకొట్టింది. కృష్ణద్వైపాయనాచార్లు 'మీ యింట్లో గడియారానికి కూడా ఎటికెట్ సరిగా తెలుసే' అన్నాఁడు.

అపాల లోపలనుంచే ఆహ్వానించింది. ఇద్దఱూ భోజనాశాలలోకి వెళ్లి చెఱోపీఁట మీఁదా కూచున్నారు.

'వడ్డన అయిం'దని అపాల అన్నాక వ్యాసమూర్తి పూజామందిరమునుంచి భోజనశాలలోకి వచ్చిచూచి, 'అంగడి పఱచావాయేమిటి? ఈ ఆనుపీట లేమిటి? ఈ వెండిచెంబు లేమిటి? ఈ వెండికంచా లేమిటి? నేనేం పెళ్లికొడుకు ననుకొన్నావా' అని అపాలతో అన్నాఁడు.

'పెళ్లికి వెడుతున్నాంగదా అని బయటికి తీశాను. బయటికి తీశానుగదా అని వేశాను. మీరు వేయించుకున్నా రనుకోరులేండి' అన్నది అపాల.

'నేను అనుకున్నా మా బిందుమాధవరావు అనుకోఁ'డని కృష్ణద్వైపాయనా చార్లన్నాఁడు.

వ్యాసమూర్తి కూచోని, పీఁట కానుకోని, బిందు మాధవరావును కన్నెత్తి చూచాఁడు 'ఈయన ఇప్పుడే సీమనుంచి దిగినట్టు న్నాఁడే' అని అనుకున్నాఁడు. 'వడ్డన దబ్బున కానీ' అని గదమాయించాఁడు.

'వడ్డన అయి యెంతసేపయింది?' అని అపాల ప్రశ్నార్థకమును పకడుగా ప్రయోగించింది. ప్రత్యుత్తరముగా పరిషేచించారు. అపాల నేయి వేసింది.

'కృష్ణద్వైపాయనాచార్లూ! నీ వుద్యోగ మేమయింది? అదిసరేకాని వీరిదేవూరు?' అని వ్యాసమూర్తి అన్నాఁడు.

'ఇహ మావుద్యోగాలే అడగాలీ? ట్యూటర్‌గా ప్రవేశిద్దామన్నా ముప్పైకన్న ఎక్కువలేదు. ఎమ్మే యెందుకు పాసయినానురా అని అనుకుంటున్నా.'

'నిజమేనోయ్, మా అప్పర్ సెకండ్రీలు, ఆ టెక్స్‌ట్లూ, ఈ టెక్స్‌ట్లే బాగావున్నవి. అట్టే పట్టుకోని పైకి పాకవచ్చు.'

'ఔను, మీకు తాసిల్దారు అయిందని విన్నాను. అందుకే ఈ విందనుకుంటున్నాను'.

'ఆఁ, అంతా అసత్యం; ఎక్కడ విన్నావు?'

'ఊరంతా మోఁగి పోతూంటే.'

'నాకసలు తాసిల్‌దారు కావాలని లేదోయ్. అందులో అన్నీ పాతకాలే. ఇట్లాగే వుంటే ఏ ఈతిబాధా లేదు.'

'అలా అనకండి. మా బంధువుల్లో కూడా ఓతాసిల్దారూ, ఓడిప్టీకలెక్టరూ ఉన్నాఁడని మేమనుకుంటాం. మాకు అయే యోగ్యత లేకపోయినా మిమ్మన్నైనా చూసి సంతోషించుకుంటూ వుంటాము.'

'మనవాళ్లలో ఈ జిల్లాలో డిప్టీకలెక్టరా?'

'పై సంవత్సరం మీకే కాకపోతే చూడనూ?'

అపాల - 'కామాక్షమ్మా! నీకే తాసిల్దారవుతుందనుకున్నట్లున్నావే!' అని అనఁగానే కామాక్షమ్మ వద్దనకు వచ్చింది.

వ్యాసమూర్తి - 'మనవాళ్లుమలపలోయ్.'

కృష్ణ - 'మీ మాట నిజం.'

వ్యాస- 'మనవాళ్లు నౌకర్లనే తిన్నగా వుంచరోయ్. అదుపాజ్ఞలు చెయ్యరు. వాళ్ళు నదురూ బెదురూ లేకుండా వుంటారు. ఇట్లా ఉపేక్షిస్తూ మనవాళ్లు పెద్ద ఉద్యోగాలకి ఉబలాటపడతారు.'

కృష్ణ- 'మీమాట నిజమేనని నేనిందాకే చెప్పానుగా?'

బిందు మాధవరావు అపాలా వ్యాసమూర్తుల ముఖాలుచూచి విశేషం ఏమీ లేక పోవుటవల్ల ఎత్తిన కళ్లు దింపాఁడు.

అపాల - 'కృష్ణద్వైపాయనాచార్లూ! భోజనసందట్టో మఱచావేమో! మీమామగారు ఈయన్ను గుఱించి అడిగారు.'

వ్యాస- 'ఔ నౌను, అడిగాను.'

కృష్ణ - 'ఇందాఁక మీరన్న మాట చూశారూ? మాయింట్లో ఒక్క నౌకరూ పని చెయ్యఁడు.'

వ్యాస - 'ఉద్యోగాన్ని పట్టి వుంటుంది లేవోయ్? ఉద్యోగాల్లో ఆఁడ ఉద్యోగాలు మగ ఉద్యోగాలూ ఉంటయ్.'

కృష్ణ - 'ఇంకొకటి మఱచారేం?'

వ్యాస - 'ఏమిటి చెపుమా?'

కృష్ణ - 'నపుంసక - ఉద్యోగాలు.'

అపాల - 'కామాక్షమ్మా! ఏమిటమ్మా భక్ష్యాలు.'

వ్యాస - 'టీకాలుపొడవడం అంత నపుంసక - ఉద్యోగం కాదుగాని ఆఁడ ఉద్యోగమే. అందులో మీనాయనగారికి రెండుపందలు ముట్టినా ఏమీ దర్జాలేదు. నౌకర్ని ఇంటికే రావద్దంటాఁడాయె. అసలు దర్జా అనేది పౌరుషంలాగా జన్మతో పుట్టుక రావాలి లెద్దూ.'

అపాల - 'ఆఁ, అల్లా అనుకున్నారో? ఆయన రమ్మండమూ అయింది, వాళ్లు రాక పోవడమూ అయింది.'

వ్యాసమూర్తి పగలఁబడి నవ్వాఁడు.

కృష్ణ - 'వెనకాల వెలమదొర సామెతలా వుంది మాపని. మేమేదొరలం, మేమే నౌకర్లం.'

అపాల 'గారెలు పట్రావేమమ్మా!' అనఁగానే కామాక్షమ్మ 'అవేనమ్మా వడ్డించేవి. వేయించుకోటం లేందే' అని చెప్పఁగా బలవంతపెట్టి బిందు మాధవరావుగారికి రెండు వేయించింది. అవి అతనివలెనే ఉదాసీనంగా విస్తట్లో ఉన్నవి.

'మీరేమో మీధోరణే గాని వీరిని కనుక్కోవడం లేదు. వీరేమీ పుచ్చుకోడమే లేదు. వీరివంతు కృష్ణద్వైపాయ నాచార్లకే వెయ్యి' అని అపాల అన్నది.

వ్యాస - 'ఆచార్లూ వీరి దేవూరు?'

'సత్తెనపల్లి.'

'ఇంటిపేరు?'

'సురభివారు.'

'బిందుమాధవరావుగారి కేమవుతారేమిటి?'

'మనమఁడు.'

'ఏం పాసయారేమిటి?'

'నాలుగేళ్లక్రింద నాతోపాటే ఇక్కడ బి.యే. పాసయినాఁడు.'

'ఏముద్యోగం?'

'ఇప్పటి వఱకూ ఏమీలేదు.'

'జెనోయ్, బి.యే. పాసయి నాలుగేళ్లు నడిచినా ఉద్యోగం లేకపోతే పాడు పరీక్షలు ఎందుకు?

'జౌనండీ, ఈ కాలములో పరీక్షలిచ్చిన వాళ్లూ, గొడ్డుమోతులూ సమానం.'

'చూశావా? ఇతను చిన్నవాడేననుకో. ముప్ఫైఏళ్లున్న వేమో! నాలుగేళ్లనుంచీ ఉద్యోగమే లేకపోతే ఇహ లిమిటేష నన్నమాటే.'

అపాల – 'మీకచ్చేరిలో కాళీలున్నాయన్నారే?'

వ్యాస – 'సరిగా గుర్తుచేశావు, ఉన్నాయి. అయితే బి.యే.లు మాకింద?'

కృష్ణ – 'అదేమిటండీ అలా అనక్కండి, నేను పనిచేయదానికి సిద్ధం.'

వ్యాస – "నీమాట కేమిలే ఇతనిమాటే ఆలోచిస్తున్నాను. నాకిందే ఒకటి ఖాళీ అయింది.'

'అయితే నాకింద బి.యే. పనిచెయ్యడం – 'అపాల సొంతంగా మామిడిపండ్లూ, పనసతొనలూ వడ్డించింది.

కృష్ణ – 'అయినా రేపు మీరు తాసిల్‌దారు కాఁబోతూవుంటే మీకింద పనిచెయ్యడం దర్జా.'

ఇట్లా మాట్లాడుకుంటూ వుండంగా వాకట్లోంచి 'నాకు ఈనాం, నాకు ఈనాం'అని వినిపించింది.

వ్యాసమూర్తి – 'వెధవలు! అల్లరి! అందులో ఆఫీసు రూముదగ్గిఱ! వెధవ రామాయి ఏంచేస్తున్నాఁడు? నరసింహాన్ని వాళ్లని అవలికి వెళ్లఁగొట్టుమను!' అని అపాలతో అన్నాఁడు. అపాల వాకిటిలోకి వెళ్లింది. వ్యాసమూర్తి చెవులు నిక్కపొడుచుకొని వింటున్నాఁడు.

పోస్టు బంట్రోతు – 'అమ్మా! అయ్య గారికి అర్జంటు టెలిగ్రాం వచ్చింది. తాసిల్ దారైందట. నాకు ఈనాం వస్తుంది' అన్నాఁడు.

అపాల – 'అది ఇల్లా పడెయ్యి.'

పోస్టు – 'ఈనాం ఇవ్వందే ఇయ్యను. అయ్యగారి చేతుల్లో నేనే పెట్టాలి.'

అపాల నవ్వుకుంటూ లోపలికి వచ్చి, 'మీకు తాసిల్‌దారైందని అర్జంటు వైరువచ్చిందట. అతగాఁడే తమచేతులలో పెట్టాలనుకుంటున్నాఁడు.'

బిందుమాధవరావు వ్యాసమూర్తి వాలకం చూచి విచిత్రపడుతూ కూచున్నాడు.

కృష్ణద్వైపాయనాచార్లు నవ్వుతూ, 'అయితే మాయింట్లో విందు తాసిల్ దారుగారూ!' అన్నాఁడు.

వ్యాస – 'అబ్బా! నాకు భోజనానికి రావడం అలవాటులో లేదు. కచేరి గుమస్తాలకు కూడా అదే చెపుతూ వుంటా.'

అపాల – 'మీకున్న జబ్బు అదే! ఈసారయినా వెళ్లుదురూ.'

వ్యాసమూర్తి భోజనం మూడో కాలంలో పడ్డది. కృష్ణద్వైపాయనాచార్లు మందకొడిగిత్తలాగా వెనకపడ్డాఁడు. వ్యాసమూర్తి 'మీరు మెల్లగా భోంచెయ్యం'డని లేచి గబగబా గదిలోకి వెళ్లి పదిరూపాయిలు బంట్రోతు కిచ్చి టెల్లిగ్రాము ఆఫీసుగదిలోకి తెచ్చి కవరు చింపి, 'ఆచార్లూ, అయన్ను గూడా తీసుకోరా! ఇక్కడే తమలపాకులు వేసుకుందురుగాని' అని అనఁగా వారిద్దఱూ లోనికి వెళ్లి కుర్చీలమీఁద కూచున్నారు. బంట్రోతు దస్కతు చేయించుకొని మాయమై పోయినాఁడు. 'ఆచార్లూ! ఈ ఆర్డరు చదువు.' అని వ్యాసమూర్తి టెల్లిగ్రాము ఇచ్చాఁడు.

అపాల తమలపాకుల పళ్లెం తెచ్చి మేజా బల్లమీఁద ఉంచి 'పరదేశిగా' అని పిలిచింది. పరదేశిగాఁడు వచ్చి వ్యాసమూర్తికి విసురుతూ నిలుచున్నాఁడు. ఫ్యాన్ నరసింహం వచ్చి ఎదురుగుండా నుంచున్నాఁడు. కామాక్షమ్మ మంచినీళ్లచెంబు అక్కడ పెట్టడానికి వచ్చింది. ఇంట్లో వున్న యావత్తు సిబ్బందీ అక్కడ ఉంది.

అప్పుడు కృష్ణ ద్వైపాయనాచార్లు ఇల్లా అన్నాఁడు – 'బిందుమాధవరావుకు తాసిల్ దారైంది.'

ఇల్లా అని ఆ టెల్లిగ్రాము బిందుమాధవ రావు చేతికి ఇచ్చాఁడు.

• *భారతి – జూలై– 1928* •